# చెయ్యికి ఓటేస్తే మూడు గంటల కరెంటే దిక్కు

- 24 గంటల విద్యుత్ ఇచ్చే బీఆర్ఎస్‌ను ఆదరించాలి
- అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్ నేతలను తరిమికొట్టాలి
- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి
- కాల్వశ్రీరాంపూర్ మండలంలో విస్తృత ప్రచారం



కాల్వశ్రీరాంపూర్: మనోహర్‌రెడ్డి కి స్వాగతం పలుకుతున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్, నవంబర్16: కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతాంగానికి మూడు గంటల కరెంటే దిక్కవుతుందని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. యాభై ఏండ్లు పాలించి కరెంట్, ఎరువుల కొరతతో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, కాంగ్రెస్ అంటేనే కరెంట్ కోతలు, ఎరువుల కోతలని, రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వని కాంగ్రెస్ పార్టీని గ్రామ పొలిమేరల్లో నుండి తరిమేయాలని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పందిల్ల, ఆరెపల్లె, మల్లయ్యపల్లె, లక్ష్మీపురం గ్రామాల్లో గురువారం రాత్రి మనోహర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మనోహర్‌రెడ్డి కి పెద్ద ఎత్తున మంగళహారతులతో, యాదవులు గొర్రెపిల్లతో, యుదిరాజ్ కులస్థులు తోపెల బుట్టితో ఘన స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఎట్లుండె తెలంగాణ ఇప్పుడెట్లైంది తెలంగాణ అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అరిగోసపడ్డారని విమర్శించారు. రైతులను ఏనాడు పట్టించుకోని కాంగ్రెస్ ను బొందపెట్టాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామ గ్రామాన పింఛన్లు, రైతు బంధు, భీమా తో పాటు తదితర సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. పందిల్ల లో రూ.2కోట్ల నిధులతో వివిద అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ గెలిస్తేనే పేద ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొంటూ, ఓటర్లను ఓటు అభ్యర్థించారు. తాను ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని మరోసారి అవకాశం కల్పించి కారుగుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యే గా గెలిపించాలని కోరారు. ఇక్కడ ఎంపీపీ నూనేటి సంపత్,జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు దాసరి లావణ్య రమేశ్, బండ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచులు గరిడె అశోక్, బోయిని చందర్, నాయకులు కొట్టె రవీందర్, ధర్మల రవి, గణపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లయ్యపల్లెకు చెందిన కోడి అర్చన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ చేరారు.

# పెద్దపల్లి జిల్లాలో 837 పోలింగ్ కేంద్రాలు

- పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్



పెద్దపల్లి: మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, నవంబర్16: పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా 837 కేంద్రాలు ఏర్పాటు చేశామని పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్ ఎన్నికల పరిశీలకులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రామగుండం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా, పెద్దపల్లి, మంథని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీధర, పెద్దపల్లి నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆశీష్‌యాదవ్, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు సునీల్ శ్రీవాత్సవ్, పోలీస్ పరిశీలకులు, కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరితో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి, మంథని, రామగుండం మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 837 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 130 సెంటర్లు భూపాల్‌పల్లి జిల్లా పరిధిలోని 5 మండలాల్లో ఉన్నాయని తెలిపారు. సెంటర్లలో తాగు నీరు, విద్యుత్, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. 80 ఏండ్లు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటేసే అవకాశం ఉన్నదన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో రిటర్నింగ్ అధికారి సదరు ఓటర్ల ఇంటి నుంచి ఓటు హక్కు స్వీకరణకు బృందాలను వీడియోగ్రఫీతో కలిపి పంపుతారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం హాజరు కావచ్చునన్నారు. భారత ఎన్నికల సంఘం 13 రకాల అత్యవసర సేవా విభాగంలో పనిచేసే వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించిందని, వీరి కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఒక తేదీని నిర్ణయించి, ఆరోజు పోస్టల్ ఓటింగ్ సెంటర్‌లో ఓటేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లందరికీ ఓటరు స్లిప్పుల పంపిణీ చేస్తామని చెప్పారు. రామగుండం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాజేశ్ సింగ్ రాణా మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలన్స్ బృందాలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. బ్యాంకుల్లో అనుమానాస్పద లావాదేవీలను పరిశీలించాలని నిర్దేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసే సమయంలో ఓటు గోప్యత పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పెద్దపల్లి జోన్ డీసీపీ ఎం చేతన, స్థానిక సం స్థల రామగుండం రిటర్నింగ్ అధికారి జె అరుణ శ్రీ, అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, ఏసీపీలు ఎడ్ల మహేశ్, తుల శ్రీనివాస్‌రావు ఉన్నారు.

# కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష

- మాజీ ఎమ్మెల్సీ, రామగుండం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నారదాసు
- నూకాంబిక పోచమ్మ ఆలయంలో బోనాల సమర్పణ



అంతర్గాం : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు

అంతర్గాం, నవంబర్ 16: కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని మాజీ ఎమ్మెల్సీ, రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. గురువారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని..రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ విజయం సాధించాలని కాంక్షిస్తూ అంతర్గాం నూకాంబిక పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. నారదాసు లక్ష్మణ్‌రావు హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఇక్కడ ఎంపీపీ దుర్గం విజయ, జడ్పీటీసీ ఆముల నారాయణ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి నాయకులు మూల విజయారెడ్డి, సర్పంచ్‌లు కుర్ర వెంకటమ్మ, నూక రాజు, ధరని రాజేశ్, బాగమ్మ గురువయ్య, బాదరవేని స్వామి, బండారి ప్రవీణ్, దేవమ్మ రాములుఎంపీటీసీ కోలిపాక శరణ్య మధుకర్‌రెడ్డి, కార్పొరేటర్ కల్వచర్ల కిష్ణవేణి, నాయకులు అనుముల కళావతి, శంకర్ గౌడ్, శశికుమార్, స్వాతి



అంతర్గాం : మాట్లాడుతున్న రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

# గులాబీ జెండా..పేదలకు అండ

- కేసీఆర్ పాలనలోనే సంక్షేమం
- కాంగ్రెస్ వస్తే కష్టాలు ఖాయం
- రామగుండం ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి చందర్
- అంతర్గాం మండలంలో ప్రజాఆశీర్వాదయాత్ర

అంతర్గాం, నవంబర్ 16: గులాబీ జెండా పేదలకు అండ అని రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలు కష్టాల పాలవడం ఖాయమని పేర్కొన్నారు. గురువారం రాత్రి అంతర్గాం మండలం పొట్యాల, విస్సంపేట, మద్దిర్యాల గ్రామాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాదయాత్రలో ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటా తిరుగుతూ కేసీఆర్ సంక్షేమ పథకాలను వివరిస్తూ, బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో చందర్ మాట్లాడుతూ ఎన్నికలు రాగానే ఆపద మొక్కులతో వచ్చే కాంగ్రెస్ నాయకులను నమ్మవద్దన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రజలను మోసం చేయడానికి అబద్ధపు హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. ఆయా పార్టీల కుతంత్రాలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నాపై నమ్మకంతో గెలిపించిన ఈ రామగుండం ప్రజానీకం ఆరోగ్యం కోసం జిల్లాలో ఏర్పాటు కావాల్సిన మెడికల్ కళాశాలను రామగుండంలో ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాన్ని అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో సకల జనుల సంక్షేమయోగ్యంగా ఉన్నదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. ఇక్కడ జడ్పీటీసీ ఆముల నారాయణ, సర్పంచ్ ఎదులపురం నీరజ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యులు గౌస్‌పాషా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి నాయక్, కోల సంతోష్‌గౌడ్, గోపు ఐలయ్య, ఇసంపల్లి తిరుపతి, కంది చంద్రయ్య, తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్‌లోకి వెదిర ఓదెలు

మంత్రి కొప్పుల సమక్షంలో చేరిక



ధర్మారం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో చేరిన ఓదెలు

ధర్మారం, నవంబర్ 16: రియల్ ఎస్టేట్ వ్యాపారి, కానంపల్లికి చెందిన వెదిర ఓదెలు గురువారం బీఆర్ఎస్‌లో చేశారు. ధర్మపురిలోని పార్టీ కార్యాలయంలో ధర్మారం ఏఎంసీ మాజీ చైర్మన్ గుర్రం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరగా, మంత్రి కొప్పుల ఈశ్వర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. మంత్రి ఈశ్వర్ చేస్తున్న అభివృద్ధి, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు చూసి బీఆర్ఎస్‌లో చేరినట్లు ఓదెలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యూత్ నాయకులు మోకెనపల్లి శ్రీనివాస్, చిదుగు సంపత్, తొగరి కుమార్, రాజు, సాయి పాల్గొన్నారు.

## యువకుడి మృతదేహం లభ్యం

జ్యోతినగర్(రామగుండం) నవంబర్ 16: విలేజ్ రామగుండానికి చెందిన మాచర్ల అజయ్‌కుమార్(27) అనే యువకుడి మృతదేహం గురువారం రామగుండం లోని ప్రైమరీహెల్త్ సెంటర్ పక్కన ఉన్న కాలువలో మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్ మృతదేహాన్ని పరిశీలించగా, ఎస్ఐ వెంకట్ కేసునమోదు చేసుకోని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఏరియా దవఖానకు తరలించారు. అజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసి రెండునెలల క్రితం ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. కొడుకు కనబడడం లేదని తల్లి మాచర్ల సూరమ్మ ఈ నెల 14న రామగుండం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసునమోదు చేశారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దపల్లి టౌన్ నవంబర్ 16: తపెద్దపల్లి–రాఘవపూర్ రైల్వేస్టేషన్ మధ్య శాంతినగర్ సమీపంలో గురువారం సుమారు 50 యేండ్ల వయస్సు గల పురుషుడు గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మరణించాడని రామగుండం రైల్వే కానిస్టేబుల్ జి.తిరుపతి తెలిపారు. అతడు రైలు నుంచి జారిపడి చనిపోయాడ లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనేది అనుమానంగా ఉన్నదన్నారు. మృతుడి వద్ద ఏలాంటి గుర్తింపు కార్డులు అభ్యం కాలేదని పేర్కొన్నారు. మృతదేహం గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో ఉన్నదని ఎవరైనా గుర్తు పట్టినట్లయితే రామగుండం రైల్వే కానిస్టేబుల్ తిరుపతి ఫోన్ నంబర్: 949304574, 8712658604కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.